క్లుప్తంగా

శ్రమదోపిడీపై కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ పట్టణ శివారులోని నాగార్జున డైయిరీలో పనిచేసే కార్మికులకు సరైన వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ సోమవారం ప్రజావాణిలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌కు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంపత్ ఫిర్యాదు చేశారు. ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు సరైన వేతనం ఇవ్వడం లేదని కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ పనిచేయిస్తున్న డైయిరీ నిర్వాహకులు, యాజమాన్యంపై సమ గ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

అధికారుల బదిలీ

శంకరపట్నం: శంకరపట్నం ఎంపీడీవో శ్రీవాణితోపాటు ఇద్దరు అధికారులు బదిలీ అయ్యారు. ఎంపీడీవో శ్రీవాణి వరంగల్, సూపరింటెండెంట్ శ్రీధర్ వీణవంక, సీనియర్ అసిస్టెంట్ సదాశివరెడ్డి జమ్మికుంటకు బదిలీ అయ్యారు. మక్త, ధర్మారం, ఇప్పలపల్లి, కరీంపేట, గొల్లపల్లి పంచాయతీ కార్యదర్శులు వంశీ, జీవిత, దివ్యాంజలి, ప్రదీప్, సంపత్‌లు బదిలీ కావడంతో సోమవారం రిలీవ్ అయ్యారు.

సుంకర్ల వ్యవస్థను పునరుద్ధరించాలి

గన్నేరువరం: గ్రామాల్లో సుంకర్ల వ్యవస్థను పునరుద్ధరించాలని బీజేపీ నాయకులు, గునుకులకొండాపూర్ మాజీ సర్పంచ్ సొల్లు అజయ్‌వర్మ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండలంలోని గుండ్లపల్లిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సుంకర్ల వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేసిందని, ప్రజాప్రతినిధులు, అధికారులకు వారధులుగా ఉండేవారిని తొలగించి ఇతర శాఖల్లో నియమించడంతో గ్రామాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి తీసుకోవడంపై దృష్టిసారించాలన్నారు. సమావేశంలో బోయిని హరీశ్, అనిల్, గణేశ్, మహేశ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

వీణవంక: అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ మండల నాయకుడు కాసర్ల సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కొండపాక గ్రామంలో మాట్లాడారు. మొదటి విడుతలో రూ.లక్ష లోపు రుణమాఫీ చేస్తానని చెప్పి సగానికి పైగా రైతులకు మొండిచెయ్యి చూపించారని, వానాకాలం ప్రారంభమై నాట్లు కూడా వేస్తున్నా ఇంతవరకు రైతుభరోసా రైతుల ఖాతాలో జమ చేయకపోడం సరికాదని, సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి రైతుభరోసా నిధులు విడుదల చేయాలని కోరారు.

శంకరపట్నం: రైతులందరికీ రుణమాఫీ చేయాలని హుజూరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ చొడమల్ల వీరస్వామి డిమాండ్ చేశారు. ఆగస్టు 15లోపు రూ.రెండు లక్షలు మాఫీ చేసి రైతుభరోసా అందజేయాలని కోరారు. కొంత మందికి మాఫీ కాక పోవడంతో ఆందోళన చెందుతున్నారని, ఆంక్షలు లేకుండా రైతులను ఆదుకోవాలన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

చొప్పదండి: కొత్తగా పట్టాదారు పాసుబుక్‌లు పొందిన రైతులు 2024–25 సంవత్సరానికి రైతుబీమాకు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ కోరారు. 18 నుంచి 59 ఏళ్లలోపు వారు అర్హులని, నామిని మార్పులు చేర్పులు చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 1లోగా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని కోరారు.

రామడుగు: మండలంలోని రైతులు రైతుబీమాకు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి యాస్మిన్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు ఏఈవో, మండల వ్యవసాయాధికారి కార్యాలయం సంప్రదించాలని, అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రిటైర్డ్ హెచ్‌ఎం మృతి

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ పట్టణానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం, అంగీరక పెద్ద రాజన్న (94) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల కంటి శస్త్రచికిత్స కోసం హైదరాబాద్ వెళ్లారు. మృతుడికి భార్య ఐదుగురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు, పెద్ద రాజన్నగా పట్టణంలో అందరికీ సుపరిచితుడు. విద్యారంగానికి ఆయన సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. పెద్దరాజన్న కుటుంబాన్ని సోమవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పరామర్శించారు. వెంట కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు వీరస్వామి, ఈశ్వరయ్య, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

కేసు నమోదు

గంగాధర: పదకొండేళ్ల బాలుడితో పని చేయిస్తున్న వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలో రాజస్థాన్‌కు చెందిన సురేశ్‌చంద్ర గుజ్జర్ తన పానీపూరి బండి వద్ద బాలుడితో పని చేయిస్తుండగా ఆపరేషన్ ముస్కాన్ 10 కార్యక్రమంలో భాగంగా లేబర్ ఆఫీసర్ గుండేటి చక్రధర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించాడు.

ఇటు ఊరట.. అటు ఆటంకం



మామిడాలపల్లి- కరీంనగర్ ప్రధాన రోడ్డు గొల్లపల్లి శివారులో తెగిపోయిన కల్వర్టు



భేతిగల్‌లో నీట మునిగిన వరి



వీణవంక: మల్లారెడ్డిపల్లిలో పరవళ్లు తొక్కుతున్న చెక్‌డ్యామ్

వీణవంక: నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెక్‌డ్యాంలు పరవళ్లు తొక్కుతున్నాయి. వీణవంక, మల్లారెడ్డిపల్లి, కోర్కల్, రామకృష్ణాపూర్ గ్రామాల్లోని చెక్‌డ్యాంలతోపాటు బేతిగల్ గ్రామంలోని ఊరచెరువు, పోచమ్మ చెరువు మత్తళ్లు దుంకుతున్నాయి. వానాకాలం పంటలకు ఢోకా లేదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కనపర్తి శివారులోని కల్వర్టు వరద ఉధృతికి ప్రమాదకరంగా మారింది. మండలంలోని మామిడాలపల్లి-కరీంనగర్ ప్రధాన రహదారి గొల్లపల్లి శివారులోని కల్వర్టు వర్షాలకు తెగిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. నూతన వంతెన పనులు జరుతుండగా ఎగువ నుంచి వచ్చిన భారీ వరదకు కల్వర్టు పూర్తిగా కొట్టుకుపోవడంతో కరీంనగర్‌కు బస్సులు, వాహనాలు పచ్చునూరు మీదుగా వెళ్తున్నాయి. కల్వర్టు పూర్తి చేయాలని గతంలోనే ప్రయాణికులు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి తలెత్తిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్‌గ్రామంలో లో ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్ల మధ్య ఏర్పాటు చేసిన సోలార్ పోల్ నేలకొరిగింది. దీంతో పోల్ ఏర్పాటు చేసిన ప్రాంతంలో అంధకారం నెలకొంటుందని ప్రజలు వాపోతున్నారు. గ్రామ, మండల ప్రత్యేకాధికారులెవరూ పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

హామీలు నెరవేర్చాలని వినతి



జమ్మికుంట: వినతిపత్రమిస్తున్న నాయకులు



చిగురుమామిడిలో...

జమ్మికుంట: ఓబీసీ మోర్చా పట్టణ, మండలశాఖ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఓబీసీలకు ఇచ్చిన హామీ అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని, బీసీ కమిషన్ వేసి వారి నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు పెంచుతామని ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

హుజూరాబాద్: ఓబీసీ మోర్చా హుజూరాబాద్ పట్టణ అధ్యక్షుడు గంట సంపత్, మండల అధ్యక్షుడు, నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. బీసీలకు న్యాయం చేయకుంటే పోరాటం చేస్తామన్నారు.

చిగురుమామిడి: అధికారంలోకి రాగానే బీసీ కులగణన చేపడతామన్నా హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని బీజేపీ నాయకులు అన్నారు. ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. 23 శాతం ఉన్న బీసీల రిజర్వేషన్లు అధికారంలోకి వచ్చాక 42 శాతానికి పెంచుతామన్న హామీ నేటికి అమలు కాలేదన్నారు. హామీలు అమలు చేయాలని లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సతీష్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు పి. శ్రీనివాస్, నాయకులు కిరణ్, రాజయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్స్



మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి

జమ్మికుంట: పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు సోమవారం స్పోర్ట్స్ యూనిఫామ్స్ అందజేశారు. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... ఉపాధ్యాయులు డబ్బులు జమ చేసి విద్యార్థుల కోసం స్పోర్ట్స్ యూనిఫామ్స్ కొనుగోలు చేసి అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తిరుమల, ఉపాధ్యాయులు ఆసియా, శ్రీలత, అర్చన, ఈశ్వర్‌రెడ్డి, మాధవి లత, విజయ, మారుతిప్రసాద్, సంపత్‌కుమార్, పిడి సారయ్య, శ్రావణి, శ్రీనివాస్, స్వాతిరావు, రాములు, జమున రాణి, శోభారాణి, సదానందం పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం 70 మంది లబ్ధిదారులకు సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రవీంద్రచారి, నాయకులు గసిగంటి సంపత్, తహసీల్దార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే

శంకరపట్నం: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అనంతరం మండల పరిషత్ సమావేశ మందిరంలో 46 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో శ్రీవాణి, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బస్వయ్య, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాకెందుకు రావడంలేదు గ్యాస్ పైసలు

చెక్కుల పంపిణీ అనంతరంనాకెందుకు గ్యాస్‌పైసలు రావడంలేదని ఎమ్మెల్యే సమక్షంలో మెట్‌పల్లి గ్రామానికి చెందిన మహిళ అధికారులను ప్రశ్నించింది. గ్యాస్‌పై రూ.500 సబ్సిడీ ఇత్తామన్నరు... ఇప్పటికి రెండు సిలిండర్లు వాడుకున్నా బ్యాంక్‌లో డబ్బులు పడలేదంటూ మహిళ బ్యాంక్, గ్యాస్ బుక్‌లు, ఆధార్‌కార్డును అధికారులపైకి విసిరేసింది. గ్యాస్ ఏజెన్సీ, ఆధార్‌లింక్‌కు మీ సేవా కేంద్రంలో సంప్రదించాలని ఎమ్మెల్యే నచ్చచెప్పారు. ప్రభుత్వం ఖాతాల్లో డబ్బులు జమచేస్తుందని ఆందోళన చెందొద్దని నచ్చజెప్పారు.

ముస్లింల సమస్యలు పరిష్కరించాలి

అసెంబ్లీ సమావేశాల్లో ముస్లింల సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేయాలని ముస్లిం జేఏసీ నాయకులు రహీం, ఆరీఫ్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ముస్లింల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

భూమిపూజకు రావాలని వినతి

కేశవపట్నం బస్టాండ్ ఎదుట నిర్మించే మాజీ మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి విగ్రహ భూమిపూజకు రావాలని టీడీపీ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు.

ఉపాధ్యాయులకు సన్మానం



టీచర్లను సన్మానిస్తున్న ఎంఈవో వేణుకుమార్



లచ్చయ్యను సన్మానిస్తున్న టీజీపీఏ నాయకులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మంజుల, శ్రీనివాస్, శ్రీదేవి, జ్యోతి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జానకి దేవి బదిలీపై వెళ్లారు. ఉపాధ్యాయులను పద్మశాలి యువజన సంఘం ఉపాధ్యక్షుడు కొలిపాక కమలాకర్, నేచర్ యూత్ క్లబ్ అధ్యక్షుడు కాసారపు పర్శరాంగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు బదిలీపై వచ్చిన ప్రిన్సిపల్ లచ్చయ్యను టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ, నైపుణ్యాలు పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో టీజీపీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నిజనిర్ధారణ కమిటీ కన్వీనర్ దార మధు, జిల్లా నాయకులు కుమ్మరి రమేశ్, దాసారంపు శ్రీనివాస్, ఎలగందుల రత్నాకర్, వాసాల కుమార్, పీఈటీలు సుమన్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ఆమోద దినోత్సవం



జాతీయ జెండాలతో విద్యార్థులు

గన్నేరువరం: గన్నేరువరం మండల లయన్స్, లియో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ జెండా ఆమోద దినోత్సవం నిర్వహించారు. 1947 జూలై 22వ తేదీన నిర్వహించిన రాజ్యాంగ సభలో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగుల మధ్యలో అశోక చక్రంతో రూపొందించిన జెండాను భారత జాతీయ జెండాగా ఆమోదించారని, నేటితో 77 ఏళ్లు పూర్తయ్యాయని, జెండాను రూపొందించిన పింగళి వెంకయ్య తెలుగు వారు కావడం గర్వ కారణమన్నారు. అనంతరం దేశభక్తిపై విద్యార్థులకు అవగాహన కల్పించి జెండా వందనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.రామయ్య, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బూర రామకృష్ణ, లియో క్లబ్ అడ్వైజర్ బూర శ్రీనివాస్, పుల్లెల జగన్, తెల్ల భాస్కర్, కాంతాల కొండల్‌రెడ్డి, కాంతాల కిషన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే చేయూత



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: ఇటీవల హుజూరాబాద్‌లో అగ్ని ప్రమాదంతో సర్వం కోల్పోయిన చిరు వ్యాపారులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి అన్నారు. తనవంతు సాయంగా 31మంది వ్యాపారులకు రూ.10వేల చొప్పున సోమవారం ఆర్థిక సాయం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదంతో వ్యాపారులు నష్టపోవడం బాధాకరం అన్నారు. ప్రమాదం జరిగినప్పుడు ఇచ్చిన హామీ మేరకు తన జీతంలో నుంచి ఒక్కో షాపుకు రూ.10వేల చొప్పున రూ.3లక్షల పదివేల ఇచ్చానని, పునర్నిర్మాణం కోసం కూడా లక్ష రూపాయలు అందించినట్లు వెల్లడించారు. అగ్ని ప్రమాదం జరిగి ఇన్ని రోజులు గడిచినా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదన్నారు. అగ్ని ప్రమాదంలో దగ్ధమైన షాపులన్నిటికీ ప్రభుత్వం లక్ష రూపాయల నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. పాపారావు బొందపై క్లియరెన్స్ తీసుకొని, పర్మినెంట్ షెట్టర్లు వేయాలని తెలిపారు. మూడు రోజులుగా హుజూరాబాద్ నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురియడంతో పలు ప్రాంతాల్లో నష్టం జరిగిందని, పునరావాస చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వీణవంక మండలం మామిడాలపల్లి అనుబంధ గ్రామం గొల్లపల్లిలోని బ్రిడ్జి పూర్తిగా పాడైపోయిందని, రాకపోకలు నిలిచిపోయాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రాణి, కౌన్సిలర్లు ప్రతాప తిరుమల్‌రెడ్డి, కేశిరెడ్డి లావణ్య, ములుగు సృజన పాల్గొన్నారు.

నీటిలో నిల్చొని మహిళల నిరసన



నీటిలో నిల్చొని నిరసన తెలుపుతున్న మహిళలు

గన్నేరువరం: మండలంలోని హసన్మాజీపల్లె గ్రామంలో ఎల్లపల్లికి వెళ్లే రోడ్డుపై వర్షపు నీరు నిలవ్వడంతో ఇబ్బందులు పడుతున్నామని సోమవారం మహిళలు నీటిలో నిల్చొని నిరసన తెలిపారు. నిల్వ నీటితో దోమలు వృద్ధి చెందుతాయని, ఎన్నికలప్పుడు వచ్చే ప్రజాప్రతినిధులు, నాయకులు ఇప్పుడు మాత్రం సమస్యను పట్టించుకోవడంలేదని, సీసీ రోడ్డు పోసిన ప్రయోజం లేదని వాపోయారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

ఎల్‌వోసీ అందజేత

ఇల్లందకుంట: మండల కేంద్రానికి చెందిన కందాల నాగరాజు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు సోమవారం రూ.రెండు లక్షల ఎల్‌వోసీని నాగరాజు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీకి బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలి

చొప్పదండి: సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థుల మెస్ చార్జీలను పెంచాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ కోరారు. పట్టణంలోని సమీకృత సంక్షేమ వసతి గృహాన్ని సోమవారం సందర్శించారు. హాస్టల్‌లోని సమస్యలు, సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలలో ప్రభుత్వం హెల్త్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పవన్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

సేవలకు సత్కారం

చొప్పదండి: పట్టణంలోని చొప్పదండి లయన్స్ క్లబ్ అందించిన సేవలకు పలు అవార్డులు లభించాయి. ఈ మేరకు జిల్లా స్థాయిలో జరిగిన సమావేశంలో హంగర్ రిలీఫ్, నీడ్ బెస్టు సర్వీస్, క్యాలెండర్ ఈవెంట్స్ ఎల్‌సీఐఎఫ్ సపోర్టు విభాగాల్లో అవార్డులు ప్రదానం చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ హనుమాండ్ల రాజిరెడ్డి ప్రదానం చేయగా వ్యక్తిగత విభాగంలో ఏడు ఉత్తమ అవార్డులను చొప్పదండి క్లబ్ అధ్యక్షుడు మహేశుని మల్లేశం, కార్యదర్శి దూస రాము, కోశాధికారి రాజేశ్ పవార్, మోర భద్రేశం, కొల్లూరి ఆనందం, పెద్ది లక్ష్మీకాంతం, కొల్లూరి జితేందర్ అందుకున్నారు. గతేడాది చేసిన సేవలకు అవార్డులు లభించినట్లు క్లబ్ అధ్యక్షుడు మల్లేశం తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



గంగాధర: మండలంలోని కురిక్యాల శివారులోని చారిత్రాత్మక ప్రదేశం బొమ్మలమ్మగుట్టు వద్ద కరీంనగర్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఆర్ఎస్ నంద, అధ్యక్షుడు దూడం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అనంతరం వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో కురిక్యాల మాజీ సర్పంచు నవీన్‌రావు, ముమ్మాడి బ్రహ్మచారి, పోతు సత్యం, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

మానకొండూర్: మానకొండూర్ సీఐగా జి.సదన్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మల్టీజోన్ 1 ఐజీపీ కార్యాలయంలో వెయిటింగ్ లిస్టులో ఉండగా మానకొండూర్ సీఐగా ఇటీవల ఉత్తర్వులు వెలువడ్డాయి. సోమవారం బాధ్యతలు స్వీకరించగా, ఇక్కడ పనిచేసిన సీఐ మాదాసు రాజ్‌కుమార్ బదిలీపై ఐజీ కార్యాలయానికి వెళ్లారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



మెడల్స్, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

గన్నేరువరం: స్మార్ట్ ఇండియా నిర్మాణంలో యువత పాత్ర అనే అంశంపై టాటా బిల్డింగ్ ఇండియా కంపెనీవారు సోమవారం గన్నేరువరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించి మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు. సీనియర్ విభాగంలో శృతి-గోల్డ్ మెడల్, అక్షిత- సిల్వర్, సిరిచందన బ్రాంజ్, జూనియర్ విభాగంలో మహిమ-గోల్డ్, అర్చన-సిల్వర్, మేఘన-బ్రాంజ్ మెడల్స్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామయ్య, టాటా బిల్డింగ్ ఇండియా కంపెనీ ప్రతినిధి శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు బానిసకావొద్దు



అవగాహన కల్పిస్తున్న జమ్మికుంట టౌన్ సీఐ రవి

శంకరపట్నం: యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని సీఐ వెంకటి అన్నారు. మండలంలోని కేశవపట్నంలో సోమవారం రాత్రి మత్తుపదార్థాలు,సైబర్‌క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తున్న క్రమంలో బ్యాంక్ వివరాలు అపరిచిత వ్యక్తులకు చెప్పొద్దని సూచించారు .ఈసమవేశంలో ఎస్సై లక్ష్మారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో టౌన్ సీఐ వరంగంటి రవి ఆధ్వర్యంలో సోమవారం సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అనవసరమైన లింక్‌లు క్లిక్ చేయొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, గంజాయి, మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న ప్రణవ్‌బాబు

హుజూరాబాద్: వర్షాలతో నష్టపోయిన పట్టణంలోని బుడగ జంగాల కాలనీవాసుల సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబు అన్నారు. సోమవారం బుడగ జంగాల కాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏటా వర్షాకాలంలో వచ్చే సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరారు. శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వెంట కాంగ్రెస్ నాయకుల బాబు, శ్రీనివాస్, పుష్పలత, దశరథం, రమేశ్, నాగరాజు, సందీప్, తదితరులున్నారు.

బోయినపల్లి వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలు



రామడుగులో కేక్ కట్‌చేస్తున్న నాయకులు

రామడుగు/గన్నేరువరం: రామడుగు మండలం గోపాల్‌రావుపేటలో సోమవారం కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ జన్మదినం పురస్కరించుకొని బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. గన్నేరువరం మండలకేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి పండ్లు పంపిణీ చేశారు.